సాక్షి సంగారెడ్డి

మంగళవారం । 18 । ఫిబ్రవరి । 2025





## ఎ'వరి'కీ రాకూడని కష్టం

యాసంగిలో వరి పంట వేసిన రైతులకు మొదట్లోనే కష్టాలు మొదలవుతున్నాయి.

వివరాలు 8లో ▸



## సీసీఐలో దళారుల పత్తి

నాలుగు సీసీఐ కేంద్రాల్లో అధికారులు వెయ్యి క్వింటాళ్లు దళారుల పత్తిని గుర్తించారు.

వివరాలు 8లో ▸



## రోడ్లపై వ్యర్థాలు వేస్తే చర్యలు

రోడ్లపై వ్యర్థాలు వేస్తే చర్యలు తీసుకుంటామని ఖేడ్ మున్సిపల్ కమిషనర్ హెచ్చరించారు.

వివరాలు 9లో ▸

# ఇక సివిల్ పనులు

**బోరంచ పంప్‌హౌస్ నిర్మాణంలో ముందడుగు**

- హరీశ్ పాదయాత్ర నేపథ్యంలో కీలక నిర్ణయం
- ప్రతిపాదిత స్థలం వద్ద ఐదెకరాలు లీజుకు తీసుకున్న కాంట్రాక్టు కంపెనీ
- సిమెంట్ పనుల ప్రారంభానికి సమాయత్తం

బసవేశ్వర ఎత్తిపోతల పథకం పనుల ప్రగతిలో కీలక ముందడుగు పడుతోంది. ఈ భారీ సాగునీటి ప్రాజెక్టు పంప్‌హౌస్ నిర్మాణానికి సంబంధించి సివిల్ పనులను ప్రారంభించేందుకు కాంట్రాక్టు కంపెనీ సమాయత్తమవుతోంది. ఈ మేరకు పంప్‌హౌస్ సమీపంలోని ఐదు ఎకరాల ప్రైవేటు భూమిని లీజుకు తీసుకుంది. సివిల్ పనులకు సంబంధించిన మెటీరియల్‌ను డంప్ చేయనుందని నీటి పారుదలశాఖ వర్గాలు చెబుతున్నాయి.



బోరంచ పంప్‌హౌస్ సివిల్ పనులు జరిగే ప్రాంతమిదే

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: అందోల్, నారాయణఖేడ్‌తో పాటు, మెదక్‌జిల్లాలోని కొన్ని మండలాల పరిధిలో 1.65 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించడమే లక్ష్యంగా ఈ బసవేశ్వర ఎత్తిపోతల పథకానికి బీఆర్‌ఎస్ సర్కార్ శ్రీకారం చుట్టిన విషయం విదితమే. ఈ పనుల్లో భాగంగా మనూరు మండలం బోరంచ వద్ద మొదటి పంప్‌హౌస్‌ను నిర్మించి.. సింగూరు జలాశయం నుంచి బ్యాక్ వాటర్‌ను 8 టీఎంసీల ఎత్తిపోసేలా ఈ ప్రాజెక్టును డిజైన్ చేశారు. ఇందుకోసం ఈ బోరంచ వద్ద ఈ పంప్‌హౌస్ నిర్మిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ పంప్‌హౌస్ కోసం ఎర్త్ వర్క్ జరిగింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారగానే ఈ పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతల పథకాల పనులను వేగవంతం చేయాలనే డిమాండ్‌తో బీఆర్‌ఎస్ పోరాటానికి సిద్ధమవుతోంది. ఇటీవల మాజీ మంత్రి హరీశ్‌రావు నివాసంలో జిల్లా ఎమ్మెల్యేలు, బీఆర్‌ఎస్ కీలక నేతలు సమావేశమై ఈ సాగునీటి పథకాల సాధన కోసం పోరాటం చేయాలని నిర్ణయించింది. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఈ ఎత్తిపోతల పథకాల ఆయకట్టు ఉన్న నియోజకవర్గాల్లో పాదయాత్ర కూడా చేయాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో నీటిపారుదలశాఖ ఈ పంప్‌హౌస్‌కు సంబంధించిన సివిల్ పనులను ప్రారంభిస్తోంది. త్వరలోనే కాంట్రాక్టు కంపెనీ ఈ పనులకు సంబంధించిన మెటీరియల్‌ను మోహరించనుందని నీటి పారుదల శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

### సుమారు రూ.15 కోట్ల మేరకు పనులు

బసవేశ్వర ఎత్తిపోతల పథకం నిర్మాణ అంచనా వ్యయం రూ.1,774 కోట్లు కాగా, ఇందులో కాంట్రాక్టర్ చేసే పనుల విలువ రూ.1,478 కోట్లు. ఇప్పటి వరకు రూ.15 కోట్ల మేర పనులకు నీటిపారుదలశాఖ ఎంబీ రికార్డు చేయగా, మరో ఐదు కోట్ల మేరకు పనులు జరిగాయని ఆశాఖ అధికారులు చెబుతున్నారు.

**రెండు పంప్‌హౌస్‌లు**

ఈ ఎత్తిపోతల పథకం కోసం రెండు పంప్‌హౌస్‌లను నిర్మిస్తున్నారు. మనూరు మండలం బోరంచ వద్ద మొదటి పంప్‌హౌస్ కాగా, రెండో పంప్‌హౌస్ రాంతీర్థ్ (కంగ్టి మండలం) వద్ద నిర్మించనున్నారు. బోరంచ వద్ద మొత్తం 12 పంపులను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో ఎనిమిది పంపుల ద్వారా సాగునీటిని రాణాపూర్‌కు తరలిస్తారు. అక్కడి నుంచి గ్రావెటీ కెనాల్ ద్వారా పంట పొలాలకు సాగునీటిని పారించేలా దీన్ని డిజైన్ చేశారు. రెండు పంపుల ద్వారా దూదుగొండ (మెదక్ జిల్లా రేగోడ్ సమీపంలో)కు నీటిని లిఫ్ట్ చేస్తారు. మరో రెండు పంపులు ద్వారా లింగంపల్లి (వట్‌పల్లి మండలం) వరకు ఎత్తిపోయనున్నారు. అక్కడి నుంచి గ్రావెటీ కెనాల్ ద్వారా నీటిని ఆయకట్టుకు తరలిస్తారు.

### సివిల్ పనులు ప్రారంభిస్తాం

బోరంచ పంప్‌హౌస్‌కు సంబంధించి సివిల్ పనులను అతికొద్ది రోజుల్లోనే ప్రారంభిస్తాం. ఈ సివిల్ పనుల ప్రారంభానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను కాంట్రాక్టు కంపెనీ చేపట్టింది. పంప్‌హౌస్ వద్ద క్యాంపు ఏర్పాటు చేసేందుకు కాంట్రాక్టు కంపెనీ చర్యలు చేపట్టింది.

–జలందర్,
డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

## న్యూస్‌రీల్

### సంగమేశ్వర, బసవేశ్వరకు అధిక నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు

నారాయణఖేడ్: సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలకు రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు డిమాండ్ చేశారు. కుడి, ఎడమ కాల్వలను ఏర్పాటుచేసి అధిక శాతం రైతుల భూములకు సాగునీరు అందించాలని కోరారు. సోమవారం నియోజకవర్గంలోని మంజీరా తీరం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నారాయణఖేడ్ వెనుకబడిన ప్రాంతం కాబట్టి సాగునీటిని అందిస్తే పంటలు బాగా పండి వ్యవసాయ అభివృద్ధికి అవకాశం ఉందని అన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాణిక్, నాయకులు సాయిలు, రమేష్, అశోక్, నర్సింహులు, ప్రవీణ్, అరుణ్, దత్తు, బాబురావు, ఎల్లయ్య పాల్గొన్నారు.

### కాంగ్రెస్ ఓబీసీ విభాగ సమావేశంలో ఎమ్మెల్యే



అజయ్‌సింగ్ యాదవ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: హైదరాబాద్ గాంధీభవన్‌లో సోమవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం సమావేశంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొన్నారు. సమావేశానికి హాజరైన ఓబీసీ విభాగం జాతీయ అధ్యక్షులు కెప్టెన్ అజయ్‌సింగ్ యాదవ్‌ను ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు.

### అసైన్డ్ భూముల పరిశీలన



అసైన్డ్ భూములను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ మనోజ్

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలం పర్వతాపూర్ గ్రామ పరిధిలో గల అసైన్డ్ భూములను ట్రైనీ కలెక్టర్ మనోజ్ సోమవారం పరిశీలించారు. గతంలో పర్వతాపూర్ పరిధిలో గల ప్రభుత్వ భూములను నిరుపేదల జీవనోపాధి కోసం ఇచ్చారు. విలువైన అసైన్డ్ భూముల గురించి ఆర్డీఓ రాంరెడ్డి, తహసీల్దార్ హసీనా బేగం ద్వారా తెలుసుకుని, రైతులతో ఆయన మాట్లాడారు. గ్రామ పరిధిలో ప్రభుత్వ, పట్టా భూముల విస్తీర్ణం గురించి కూడా ఆయన తెలుసుకున్నారు. అటవీ భూముల స్థితిగతుల గురించి కూడా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్డీఓ రాంరెడ్డి, తహసీల్దార్ హసీనా బేగం, ఆర్ఐ సాయికిరణ్‌లు ఉన్నారు.

### హరీశ్ ప్రకటనతో కదిలిన అధికారులు

మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్



జోగిపేటలో కేక్ కట్ చేస్తున్న క్రాంతి

జోగిపేట(అందోల్): బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు పాదయాత్ర ప్రకటనతో అధికార యంత్రాంగంలో కదలిక వచ్చిందని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. ఈ మేరకు సంగమేశ్వర, బసవేశ్వర పథకాలు పనులు ప్రారంభిస్తామని ఇరిగేషన్ అధికారులు హరీశ్‌రావుకు ఫోన్‌లు చేసి చెబుతున్నారని చెప్పారు. జోగిపేటలోని పార్టీ కార్యాలయంలో సోమవారం కేసీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో దుష్పాలన కొనసాగుతోందని మండిపడ్డారు. అనాలోచిత నిర్ణయాలతో ప్రజలను, రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్షను నెరవేర్చింది కేసీఆరేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ పి.జైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బాలయ్య, రామాగౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ పి.నారాయణ, అందోలు, పుల్కల్ మండల పార్టీల అధ్యక్షులు లక్ష్మీకాంతరెడ్డి, విజయ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు సార శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# విందుకు వెళ్లి వస్తుండగా..

- బస్సు ఢీకొని ఇద్దరు యువకుల మృతి
- కోహీర్ మండలం సేడెగుట్ట తండా వద్ద ఘటన



శంకర్‌రాథోడ్



జాటోతు పవన్

జహీరాబాద్: ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ సంఘటన కోహీర్ మండలం సిద్దాపూర్ తండా సమీపంలో తాండూరు రహదారిపై ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. కోహీర్ పోలీసుల కథనం ప్రకారం.. జహీరాబాద్ మండలం అర్జున్‌నాయక్ తండాకు చెందిన రాథోడ్ శంకర్(25), జాటోతు పవన్(26) రాత్రి సేడెగుట్ట తండాలో జరిగిన జాతర విందులో పాల్గొన్నారు. అనంతరం సమీపంలోని సిద్ధాపూర్ తండాకు చెందిన బంధువుల ఇంటికి వెళుతున్న క్రమంలో తాండూరు నుంచి జహీరాబాద్ వెళుతున్న నైట్‌హాల్ట్ ఆర్టీసీ బస్సు గొటిగార్‌పల్లి ఫారెస్టు మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాథోడ్ శంకర్ అక్కడికక్కడే మరణించాడు. తీవ్రంగా గాయపడిన పవన్‌ను వైద్యం నిమిత్తం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలొదిలాడు. మృతులు సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇద్దరు యువకుల మరణంతో అర్జున్‌నాయక్ తండాలో విషాదం అలుముకుంది. కోహీర్ పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

# బీమా డబ్బుల కోసం బావ హత్య

- బామ్మర్ది సహా మరొకరు అరెస్టు
- అమీన్‌పూర్‌లో ఘటన



నరేశ్ నాయక్



దేవిసింగ్

పటాన్‌చెరు టౌన్: బీమా డబ్బుల కోసం సొంత బావను హత్య చేశాడు. సీఐ కథనం ప్రకారం.. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం లింగాయపల్లి సొమ్లు తండాకు చెందిన భానోత్ గోపాల్ బతుకుదెరువు కోసం పదేళ్ల కిందట భార్య లక్ష్మి, పిల్లలతో కలిసి అమీన్‌పూర్‌కు వచ్చి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 14న రాత్రి గోపాల్ చెత్త పారివేసి వస్తానని ఇంట్లోంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతుకుతుండగా 15న సాయంత్రం అమీన్‌పూర్ శ్మశానవాటిక వెనుక మృతదేహమై కనిపించాడు. మృతుడి కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో భాగంగా.. గోపాల్ బామ్మర్ది నరేశ్ నాయక్, నరేశ్ మేనమామ దేవిసింగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా.. తామే హత్య చేశామని అంగీకరించారని సీఐ తెలిపారు. ఏడాది కిందట గోపాల్ నాయక్ పేరు మీద నరేశ్, దేవిసింగ్ బ్యాంకు రుణంతో జేసీబీ తీసుకున్నారు. గోపాల్ నాయక్‌పై రిస్క్ ఇన్సూరెన్స్‌తోపాటు రూ.29 లక్షలు ఎల్ఐసీ ఇన్సూరెన్స్ చేయించారు. జేసీబీ వ్యాపారం సరిగా నడవకపోవడంతో అప్పులు చేసిన నరేశ్.. బావ చనిపోతే ఇన్సూరెన్స్ డబ్బులు వస్తాయని భావించాడు. 14న పథకం ప్రకారం మద్యం సేవిద్దామని గోపాల్ నాయక్‌ను అమీన్‌పూర్ శ్మశాన వాటిక వద్దకు నరేశ్ పిలిచాడు. అక్కడే నరేశ్ మేనమామ దేవిసింగ్ సాయంతో బావను చున్నీతో ఉరి వేసి హత్య చేశాడు. అనారోగ్యంతో సాధారణంగా మృతి చెందాడని నమ్మించే ప్రయత్నం చేసేందుకు చూశారు. ఫోన్ చేసి పిలవడంతో ఇద్దరిని అనుమానించిన పోలీసులు.. తమదైన శైలిలో విచారణ చేపట్టి టేక్మాల్ మండలం షాబాద్ తండాకి చెందిన నరేశ్ నాయక్, వెంకట్రావు తండాకి చెందిన దేవి సింగ్ సోమవారం రిమాండ్‌కు తరలించారు.

## కల సాకారమైన వేళ..

**విధుల్లో చేరిన 2008 డీఎస్సీ ఉపాధ్యాయులు**

న్యాల్‌కల్(జహీరాబాద్): 2008 డీఎస్సీ ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరారు. మండలానికి వచ్చిన 12 మంది అభ్యర్థులు తమ నియామక పత్రాలను ఎంఈఓ మారుతి రాథోడ్‌కు అందజేశారు. వారికి కేటాయించిన ఖలీల్‌పూర్, న్యామతాబాద్, మెటల్‌కుంట, హద్నూర్, గణేష్‌పూర్, మిర్జాపూర్(ఎన్), చినిగెపల్లి, అత్నూర్, డప్పూర్, హుస్సెన్ నగర్ ప్రాథమిక పాఠశాలకు చేరాలని ఎంఈఓ వారికి జైనింగ్ రిపోర్టు ఇచ్చారు.



ఎంఈఓకు నియామక పత్రాలు అందజేస్తున్న 2008 డీఎస్సీ అభ్యర్థులు



## సార్.. మళ్లీ సీఎం కావాలి

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు కేక్ తినిపిస్తున్న నాయకులు

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలు సంగారెడ్డిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. నాయకులు పరస్పరం మిఠాయిలు తినిపించుకున్నారు. బాణాసంచా కాల్చారు. కేసీఆర్ సార్ మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, నాయకులు విజయేందర్‌రెడ్డి, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి, జెడ్పీ మాజీ చైర్మన్ బాలయ్య పాల్గొన్నారు. – సంగారెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

# ఇష్టంతో కష్టపడి చదవండి

- ఇప్పుడే ఉన్నత లక్ష్యాలను ఎంచుకోండి
- విద్యార్థులకు కలెక్టర్ క్రాంతి ఉద్బోధ
- భెల్ జిల్లా పరిషత్ పాఠశాల సందర్శన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాన్ని సాధించగలరని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సోమవారం సాయంత్రం బీహెచ్ఈఎల్ (భెల్) టౌన్‌షిప్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలను ఆమె సందర్శించారు. పాఠశాల ఆవరణలో ఉన్న రెసిడెన్షియల్ బ్రిడ్జ్ స్కూల్, అందులోని కంప్యూటర్, సైన్స్ ల్యాబ్, వంటగదిని పరిశీలించారు. పాఠశాలలోని సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. నీటి సమస్య, విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు లేవని, అదే విధంగా తరగతి గదులల్లో విద్యార్థులు కూర్చునేందుకు టేబుల్, బల్లలు సరిపడా లేవని ఉపాధ్యాయులు కలెక్టర్‌కు వివరించారు. స్పందించిన ఆమె.. భెల్ యాజమాన్యంకు సీఎస్ఆర్ నిధుల కింద సమస్యలను పరిష్కారించాలని కోరుతూ లేఖ రాయాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లును ఆదేశించారు.

అనంతరం పరీక్షలకు సిద్ధమవుతున్న పదవతరగతి విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షల సమయం దగ్గర పడుతుందని దానిని దృష్టిలో పెట్టుకొని కష్టపడి చదివి ప్రతి విద్యార్థి 10కి10 జీపీఏ సాధించాలని ఆకాంక్షించారు. భవిష్యత్‌లో ఏ ఉద్యోగం చేయాలో ఇప్పుడే నిర్ణయించుకుని అందుకు అనుగుణంగా కష్టపడి చదువుకోవాలని సూచించారు. జీవితంలో పదోతరగతి టర్నింగ్ పాయింట్ అని చెప్పారు. తరగతి గదిలో చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె కోరారు. పదవతరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, ఎంఈఓ పీపీ రాథోడ్, తహసీల్దార్ సంగ్రాంరెడ్డి, ప్రధానోపాధ్యాయులు రాములు, ఆర్ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

### మేడం.. మాకు సార్లు కావాలి

"మేడం.. హిందీ, పీఈటీ సార్లు లేరు. మాకు ఉపాధ్యాయులు కావాలి.." అని రెసిడెన్షియల్ బ్రిడ్జ్ స్కూల్ (ఆర్‌బీఎస్) విద్యార్థులు కలెక్టర్ క్రాంతిని వేడుకున్నారు. సోమవారం సాయంత్రం భెల్ టౌన్‌షిప్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించి తిరిగి వెళ్లే సమయంలో క్రీడా ప్రాంగణంలో ఆడుకుంటున్న రెసిడెన్షియల్ బ్రిడ్జ్ స్కూల్ విద్యార్థులను పిలిచి మాట్లాడారు. ఎలా చదువుకుంటున్నారు.. మీకేమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగారు. తమకు హిందీ, పీఈటీ సార్లు లేరని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జెడ్పీ పాఠశాలలో ఉన్న పీఈటీ ఉపాధ్యాయుడు ఈ విద్యార్థులను కూడా ఆడిస్తే ఏమవుతుందని ప్రశ్నించారు. ఈ సమస్యను పరిష్కారించాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లను కలెక్టర్ ఆదేశించారు. దాంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

# ప్రజావాణిలో రెవెన్యూ సమస్యలే అధికం

**పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయండి: కలెక్టర్**

సంగారెడ్డి జోన్: ప్రజావాణిలో రెవెన్యూకు సంబంధించిన దరఖాస్తులే అధికంగా వస్తున్నాయి. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వారితో కలెక్టర్ వల్లూరు క్రాంతి అర్జీలు స్వీకరించారు. మొత్తం 43 అర్జీలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో రెవెన్యూకు సంబంధించిన సమస్యలే అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి అర్జీని పరిశీలించి, తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన సమస్యలపై అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాలని, పరిష్కారం ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కాగా కార్యక్రమంలో డీఆర్ఓ పద్మజా రాణి, జెడ్పీ సీఈవో జానకిరెడ్డి, డీపీవో సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

# 20న ఉచిత మెగా వైద్య శిబిరం

జహీరాబాద్: ఈనెల 20వ తేదీన జహీరాబాద్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సామాజిక సేవకులు ఇమ్రాన్ మొహియొద్దీన్, వైద్యులు ఎండీ నవాజ్‌అలీ, క్యాన్సర్ సర్జన్ రాజేందర్ బైశెట్టి తెలిపారు. నీలం ఆస్పత్రి సహకారంతో ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వారు చెప్పారు. ప్రముఖ వైద్యులతో మెగా ఉచిత వైద్య శిబిరంలో క్యాన్సర్, గుండె, గైనిక్, పీడియాట్రిక్, అల్ట్రాసౌండ్ స్కాన్, ఓరల్ స్క్రీనింగ్, బ్రెస్ట్ స్క్రీనింగ్, థైరాయిడ్ స్క్రీనింగ్ తదితర ఖరీదైన పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తామన్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

# ప్రతి పనికి పైసా.. ఏ కైసా?

- ట్రాన్స్‌కోలో లంచం షరా మామూలే..
- ఫిర్యాదు చేసిన వారిపై వేధింపులు

పటాన్‌చెరు: విద్యుత్‌శాఖలో ప్రతీ పనికి లంచం షరా మామూలుగా మారింది. ఎంతో కొంత ముట్టచెప్పంది ఏ పనీ ముందుకు సాగడం లేదు. ఇవ్వకపోతే వినియోగదారులను ముప్పు తిప్పలు పెడుతూ.. మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్నారు. దళారులను విద్యుత్ సంస్థల ఇంజనీరింగ్ అధికారులు అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అపార్టుమెంట్లు, కొత్త వెంచర్లకు విద్యుత్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరుకు రూ.లక్షల్లో లంచం డిమాండ్ చేస్తున్నారని సమాచారం. పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారిన గ్రామాల్లో ఆక్యుపెన్సీ, ఎన్ఓసీల పేరిట విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. అడిగినంత చెల్లిస్తే పంచాయతీ అనుమతితో కూడిన భవనాలకు అప్పటికప్పుడు విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నారు. ప్రజాప్రతినిధులు ఫోన్ చేసినా స్పందించని అధికారులు, దళారులు ద్వారా వెళితే మాత్రం పనులు పూర్తిచేస్తున్నారు. పారిశ్రామిక ప్రాంతంలో లైన్‌మెన్ దర్శనం కూడా సామాన్యులకు కష్టంగా మారింది. విద్యుత్‌సంస్థల్లో అయా పోస్టింగ్‌ల కోసం పెద్దఎత్తున పైరవీలు చేసి ఇక్కడకు బదిలీపై వస్తున్నారు. క్షేత్రస్థాయిలో తమ వారికి పోస్టింగ్‌లు ఇచ్చిన రాష్ట్రస్థాయి అధికారులు వాటాలు తీసుకుంటున్నారని బహిరంగ చర్చ జరుగుతుంది. అధికారులపై ఫిర్యాదులు అందినప్పుడు విచారణ చేయాల్సిన విజిలెన్స్ అధికారులు ఫిర్యాదు ఇచ్చిన వారిని ఇబ్బంది పెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



అక్రమ నిర్మాణాలకు ట్రాన్స్‌ఫార్మర్

### ఇవీ రేట్లు..

కొత్త మీటరు కోసం రూ. ఆరు నుంచి రూ. పది వేలు, ప్యానల్ బోర్డ్ల కోసం రూ.45 వేలు, అపార్ట్‌మెంట్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం రూ.1.5 నుంచి రూ. 2లక్షలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వెంచర్లలో విద్యుత్ కనెక్షన్లు, వైర్లు వేసేందుకు అనుమతి, ఇతర పనుల కోసం రూ. కోట్లలో డిమాండ్ చేస్తున్నారు. పటాన్‌చెరులో ఓ భారీ వెంచర్‌లో విద్యుత్ కనెక్షన్ కోసం కేవలం లంచం సొమ్మునే రూ. ఏడు కోట్ల వరకు డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది.

### నా దృష్టికి రాలేదు

నా దృష్టికైతే ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. ఎవరైనా ఇబ్బంది పడితే తనకు ఫిర్యాదు చేయవచ్చు. ఎలాంటి అవినీతికి తావు లేని వ్యవస్థ ఇప్పుడు అందుబాటులో ఉంది. ఆన్‌లైన్ ద్వారానే కస్టమర్లు తమకు కావాల్సిన సేవలను పొందవచ్చు. ఆఫీసుకు రానవసరం లేదు. దళారులను ఆశ్రయించాల్సిన పనే లేదు. నేను ఇటీవలే బదిలీపై వచ్చాను. వినియోగదారులకుకు ఎలాంటి ఇబ్బంది లేని సేవలు అందించేందుకు కృషి చేస్తా.

– సంజీవ్, ఏడీఈ, టీజీఎస్‌పీడీసీఎల్

## క్లుప్తంగా

### రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

సిద్దిపేటరూరల్: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు చింతమడక పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల యాజమాన్యం సోమవారం తెలిపారు. పాఠశాలలో 9వ తరగతికి చెందిన శ్రీలాస్య, వైష్ణవి జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో 400 మీటర్స్ పరుగుపందెంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి రాజిరెడ్డి, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

### నిందితుడిని పట్టించిన కాల్‌డేటా

- ప్రాణం తీసిన వివాహేతర సంబంధం
- పెట్రోల్ పోసి నిప్పంటించి మహిళ హత్య

మెదక్ మున్సిపాలిటీ: అదృశ్యమైన వివాహిత దారుణహత్యకు గురికాగా.. కాల్‌డేటా హంతకుడిని పట్టించింది. వివాహేతర సంబంధంతో మహిళపై పెట్రోల్ పోసి నిప్పంటించి హతమార్చిన ఘటనకు సంబంధించిన కేసును పోలీసులు ఛేదించారు. మెదక్ పట్టణ సీఐ నాగరాజు కథనం మేరకు.. మెదక్ పట్టణంలోని ఫతేనగర్‌లో నివసించే మంగలి రేణుక(45) స్థానికంగా ఓ ఆస్పత్రిలో స్వీపర్‌గా పనిచేస్తుంది. 6న సదరు మహిళ కనిపించకుండా పోవడంతో ఆమె కుమారుడు శ్రీనాథ్ 8న పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మహిళ సెల్‌ఫోన్ కాల్ డేటాను పరిశీలించగా చిన్నశంకరంపేట మండలం ఎస్.కొండాపూర్ గ్రామానికి చెందిన బత్తుల యేసు ఆఖరి కాల్ ఉంది. దాని ఆధారంగా అతడిని పట్టుకున్న పోలీసులు తమదైన శైలిలో విచారించగా అసలు విషయం బయట పడింది. రేణుకతో వివాహేతర సంబంధం కలిగి ఉన్న బత్తులయేసు 6న ఎస్.కొండాపూర్ అడవి ప్రాంతంలోకి తీసుకెళ్లాడు. అక్కడే ఆమెపై పెట్రోల్‌పోసి నిప్పంటించి హతమార్చాడు. నేరం ఒప్పుకోవడంతో ఆదివారం నిందితుడిని అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

### 15 మేకలు సజీవ దహనం

- మరో పదింటికి గాయాలు
- నాదులాపూర్‌లో పాకకు నిప్పు



మంటలో దహనమైన మేకలు

వట్‌పల్లి(అందోల్): మేకల పాకకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో 15 మేకలు సజీవ దహనమయ్యాయి. ఈ ఘటన అందోలు మండల పరిధిలోని నాదులాపూర్ గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన కలాలి రమేశ్ తనకున్న 25 మేకలను ఎప్పటిలాగే ఆదివారం ఇంటి వెనుకాల ఉన్న పాకలో కట్టేశాడు. అర్ధరాత్రి పూట మంటలు చెలరేగడంతో పరిసర ప్రాంతాల వారు గమనించి రమేశ్‌కు తెలిపారు. ఇరుగుపొరుగు వారి సాయంతో మంటలార్పే ప్రయత్నం చేసినా 15 మేకలు చనిపోగా, మరో 10 మేకలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో సుమారు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మేకల పోషణే జీవనాధారంగా చేసుకొని జీవిస్తున్న తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు. వెటర్నరీ అధికారులు మృతి చెందిన మూగజీవాలను పరిశీలించి నివేదికను ప్రభుత్వానికి ఇస్తామని తెలియజేశారు. బాధితులు జోగిపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.





ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు దుబ్బాక పట్టణానికి చెందిన కేసుగారి స్వామి. తనకున్న 12 ఎకరాల్లో వరి నాటు వేశాడు. నెల పదిహేను రోజులు అవుతున్నా పంట పచ్చబడకుండా ఎర్రబడి కుళ్లిపోతూ ఎదగకుండా చచ్చిపోతుంది. రెండు సార్లు దుక్కిమందు, యూరియా, సల్ఫర్, పొటాష్ చల్లినా లాభం లేదు. ఎండ్రిన్ గోలీలు, ఫర్టిలైజర్ షాపుల్లో ఇచ్చిన మందులు రెండు మూడు రకాలు కలిపి స్ప్రే చేసినా పంట కోలుకోవడం లేదు. పంటకు ఏ మందులు కొట్టినా పని చేస్తలేవని, రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టానని, అందరి చేలు గిట్లనే ఎర్రబడి పోతున్నాయి.. ఏం అర్థకావడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

– కే సుగారి స్వామి, రైతు దుబ్బాక

# ఎ'వరి'కీ రాకూడని కష్టం

## కుళ్లిపోయి.. చచ్చిపోతున్న వరి

- నాట్లేసి 45 రోజులు గడుస్తున్నా ఎదుగుదల లేని పంట
- జిల్లాలో పెద్ద ఎత్తున సాగు
- ఏ మందులు వాడినా దక్కని ఫలితం
- దున్ని.. మళ్లీ నాట్లేస్తున్న రైతులు
- పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులు

మొగిపురుగు, వాతావరణ పరిస్థితులే కారణమంటున్న శాస్త్రవేత్తలు, అధికారులు



నాట్లేసి 45 రోజులు గడుస్తున్నా ఎదుగుదల లేని పంట

దుబ్బాక: యాసంగిలో వరి పంట వేసిన రైతులకు మొదట్లోనే కష్టాలు మొదలవుతున్నాయి. ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకొని.. అప్పులు తెచ్చి.. పుట్టెడు పెట్టుబడులు పెట్టి వరి పంట సాగు చేస్తే చేతికొస్తుందన్న గ్యారంటీ లేక జిల్లా రైతులు ఆందోళన వ్యక్తం చెందుతున్నారు. వానా కాలంలో మొగి పురుగు రోగం, భారీ వర్షాలతో పంటలు దెబ్బతిని దిగుబడులు రాక రైతులకు పెట్టుబడులు మీద పడ్డాయి. ఈ యాసంగిలోనైనా పంట బాగా పండుతాయన్న గంపెడాశతో పెద్ద ఎత్తున వరి పంటలు సాగు చేశారు. తీరా వరినాట్లు వేసి నెలరోజులు గడుస్తున్నా పంట పచ్చబడటం లేదు.

### మరోసారి నాట్లు

మొక్క ఎదగకుండా ఎర్రబడి కుళ్లిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలు వేసినప్పటి నుంచి రకరకాల మందులు చేసినా.. వివిధ రకాల క్రిమి సంహారక మందులు చల్లినా పంట కోలుకోవడం లేదు. ఎదుగుదల లేకుండా కుళ్లిపోతూ మొక్కలు చచ్చిపోయి పొలాల్లో పెద్ద గ్యాబులు (ఖాళీ స్థలాలు) ఏర్పడుతున్నాయి. వ్యవసాయాధికారులు..డాట్ సెంటర్ సైంటిస్టులు సైతం జిల్లాలో ఎర్రబడి ఎదుగుదల లేని వరి పంటలను పరిశీలిస్తున్నారు. చాలా మంది రైతులు వేసిన వరినాట్లు కుళ్లిపోయి చనిపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో వేసిన నాటును దున్నేసి మళ్లీ నాట్లు వేశారు.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- రైతులు పొలాల్లో ఎక్కువ నీరు నిల్వ ఉంచకుండా అరబెడుతూ నీరు పెట్టాలి
- ఇష్టం వచ్చిన మందులు చల్లవద్దు ఎండ తీవ్రత పెరిగితే యధావిధిగా పంటలు కోలుకుంటాయి.
- మొగిపురుగు నివారణకు 4జీ గుళికలు వేసుకోవాలి.
- ఫర్టిలైజర్ల డీలర్లకు కూడా ఏ మందులు పడితే అవి ఇవ్వొద్దని తాము సూచించిన మందులే రైతులకు ఇవ్వాలని చెబుతున్నాం
- రైతులు వ్యవసాయ అధికారుల సూచనల మేరకే మందులు వేసుకోవాలి. లేకుంటే పంటకు ఫలితం ఇవ్వక పోవడమే కాకుండా ఆర్థికంగా నష్టం వాటిల్లుతుంది.

### 3 లక్షలకు పై చిలుకు ఎకరాల్లో సాగు..

జిల్లాలో చెరువులు, కుంటల్లో నీరు సమృద్ధిగా ఉండటంతో ఈ యాసంగిలో రైతులు పెద్ద ఎత్తున వరి సాగు చేశారు. ఈసారి 3.50 లక్షల ఎకరాల్లో సాగు అవుతుందని వ్యవసాయాధికారుల అంచనా ఉండగా ఇప్పటి వరకు 3 లక్షలకు పైగా ఎకరాల్లో సాగు పూర్తి అయ్యింది. ఇంకా వరి నాట్లు వేస్తూనే ఉన్నారు.

### ఇష్ట మొచ్చిన మందులు

పంట ఎదుగుదల లేకుండా ఎర్రగా మారి కుళ్లిపోతుండటంతో రైతులు రకరకాల మందులను, గులకలను తెచ్చి ఇష్టం మొచ్చినట్లుగా చల్లుతున్నారు. ఫర్టిలైజర్ దుకణాల్లో వారు ఏ మందులు ఇస్తే అవి తెచ్చి స్ప్రే చేస్తున్నారు. పుట్టెడు అప్పులు తెచ్చి ఎన్ని మందులు చల్లినా ఫలితం లేకపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

### వాతావరణ పరిస్థితులే కారణం

వరి పంటలు కుళ్లిపోతూ ఎదుగుదల లేకపోవడానికి మొగి పురుగు ఉధృతి, వాతావరణ పరిస్థితులే కారణమంటూ వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. జిల్లాలో పలు వరి పంటలను డాట్ సెంటర్ శాస్త్రవేత్తలతోపాటు వ్యవసాయాధికారులు పరిశీలించారు..ఈ సందర్భంగా వారు పలు సూచనలు రైతులకు ఇచ్చారు.

### ఎన్ని మందులు చల్లినా ఫలితం లేదు



జనవరిలో నాటేసిన వరి మొత్తం ఎర్రబడి కుళ్లిపోయి మొత్తం చచ్చిపోతుంది. ఎన్ని మందులు చల్లినా లాభం లేదు. ఇప్పటికే రూ.2 లక్షల వరకు పెట్టుబడి ఖర్చు అయింది. కనీసం పెట్టుబడి కూడా వస్తదో లేదో. చాలా మంది రైతులు దున్ని మళ్లీ నాట్లేస్తుండ్రు. గిసోంటి పరిస్థితి నేను ఎప్పుడు చూడలే. రైతులు చాలా అవస్థలు పడుతుండ్రు.

– గుండెల్లి శ్రీనివాస్‌రెడ్డి, రైతు

### అవగాహన కల్పిస్తున్నాం



వరి పంటలు మొగిపురుగు, చలి తీవ్రతతో ఎర్రబడి, ఎదుగుదల లేకపోవడంతో పాటు వానాకాలంలో నీరు పొలాల్లో నిలువుండటం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది. భూమి ఆరకుండానే పంటలు వేశారు. గ్రామాల్లో తిరుగుతూ రైతులకు పంటలను పరిశీలిస్తూ అవగాహన కల్పిస్తున్నాం. తాము సూచించిన మందులే వాడాలి. పొలాలను ఆరబెట్టాలి. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే (ఎండలు ముదిరితే) మళ్లీ వరి పంటలు బాగవుతాయి.

–రాధిక, జిల్లా వ్యవసాయాధికారి

## తాగడానికి డబ్బులు ఇవ్వలేదని..

- భార్యను కొట్టి చంపిన భర్త
- తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలో ఘటన



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తూప్రాన్: మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదని కోపోద్రిక్తుడైన భర్త భార్యను కొట్టి చంపాడు. ఈ ఘటన మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ రంగా కృష్ణ కథనం మేరకు.. మధ్యప్రదేశ్‌కు చెందిన భార్యాభర్తలు ఆదివాసి అశోక్, భార్య శివకాలి బతుకుదెరువు కోసం మూడు నెలల కిందట మెదక్ జిల్లా తూప్రాన్‌కు వచ్చి పోతరాజుపల్లిలో నివాసం ఉంటున్నారు. మద్యానికి బానిసైన అశోక్ నిత్యం డబ్బుల కోసం భార్యని వేధించేవాడు. ఆదివారం రాత్రి డబ్బుల కోసం భార్యతో గొడవకు దిగాడు. ఆమె డబ్బులు ఇవ్వకపోవడంతో కోపోద్రిక్తుడై కట్టెతో విచక్షణారహితంగా భార్యను కొట్టడంతో తీవ్ర గాయాలై మృతి చెందింది. ఉదయం చుట్టుపక్కల వారు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ శివానందంతో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించి అశోక్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశామని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



రాజేందర్(ఫైల్)

కొల్చారం(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రానికి సమీపంలోని మెదక్–నర్సాపూర్ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి చోటు చసుకుంది. ఎస్ఐ మహమ్మద్ గౌస్ కథనం మేరకు.. కౌడిపల్లి మండలం మహమ్మద్ నగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కన్నారం గ్రామానికి చెందిన బసవన్నగారి రాజేందర్ (25) హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తూ అక్కడే నివాసముంటున్నాడు. రెండురోజుల కిందట గ్రామానికి వచ్చిన రాజేందర్ ఆదివారం ఉదయం మెదక్ పట్టణంలో పని నిమిత్తం వెళ్లి తిరిగొస్తున్నాడు. మండల కేంద్రానికి సమీపంలోని లోతు వాగు మలుపు వద్దకు రాగానే హైదరాబాద్ నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు రాజేందర్ బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### చికిత్స పొందుతూ యువకుడు



కనకరాజు(ఫైల్)

తూప్రాన్: పురుగు మందు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన తూప్రాన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ మండలం మల్కాపూర్‌కు చెందిన మామిండ్ల కనకరాజు(30) తల్లిదండ్రులు, భార్యాపిల్లలతో కలిసి ఉంటూ వ్యవసాయం చేస్తున్నాడు. కనకరాజుకు అప్పులు కావడంతో తీర్చలేక మనస్తాపం చెంది 9న ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం ఆర్వీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స అయిపోయాక 15న ఇంటికి తీసుకొచ్చారు. 16న సాయంత్రం మరోసారి అస్వస్థతకు గురి కావడంతో చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు.

## ఇద్దరు అదృశ్యం


### పరిశ్రమలో పని చేస్తున్న యువకుడు



తానాజీ

మనోహరాబాద్(తూప్రాన్): పరిశ్రమలో పని చేస్తున్న యువకుడు అదృశ్యమైనట్లు ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మహారాష్ట్ర సోలాపూర్ జిల్లాకు చెందిన తానాజీ పాలిమార్ స్టీల్ పరిశ్రమలో వెల్డర్‌గా పని చేస్తున్నాడు. 9న బయటకు వెళ్లిన ఇంటికి రాలేదు. తానాజీ అన్న గోపాల్‌కు ఇంటి యజమానులు సమాచారం అందించగా చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. గోపాల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### మతి స్థిమితం లేని వృద్ధురాలు



వృద్ధురాలు లక్ష్మీ

సిద్దిపేటకమాన్: మతి స్థిమితం సరిగా లేని వృద్ధురాలు అదృశ్యమైన ఘటనపై సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం మేరకు.. సిద్దిపేట ఆదర్శనగర్‌కు చెందిన శీలం లక్ష్మీ (90) స్థానికంగా కుటుంబంతో కలిసి నివాసం ఉంటుంది. లక్ష్మీ తరచూ కాలనీలో తిరుగుతూ రాత్రికి ఇంటికి చేరుకునేది. శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. లక్ష్మీ మనవరాలు జ్యోతి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## మహిళపై దాడి కేసులో ఇద్దరు రిమాండ్

### తీవ్ర గాయాలై ఆస్పత్రిలో మృతి

మునిపల్లి(అందోల్): మహిళపై దాడి చేసి ఆమె మృతికి కారకులైన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ రాజేశ్ నాయక్ కథనం మేరకు.. మండలంలోని అంతారం గ్రామానికి చెందిన దూదేకుల మొహ్మద్ ఇస్మాయిల్ అదే గ్రామానికి చెందిన వీరారెడ్డి, విజయరెడ్డికి చెందిన ఇంటి ఎదుట ఖాళీ స్థలంలో మూత్ర విసర్జన చేశాడు. దీంతో ఇద్దరూ కలిసి ఇస్మాయిల్‌పై దాడి చేశారు. తండ్రి అరుపులకు అలియ బేగం వచ్చి ఆపుతుండగా ఆమె పై కూడా దాడి చేశారు. దీంతో తీవ్ర గాయాలైన ఆమెను సంగారెడ్డిలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ 16న బేగం మృతి చెందింది. మహిళపై దాడి చేసి మృతికి కారణమైన వీరారెడ్డి, విజయరెడ్డిని సోమవారం మండలంలోని బుదేరాలో కొండాపూర్ సీఐ వెంకటేశం, ఎస్ఐ రాజేశ్ నాయక్ పట్టుకొని రిమాండ్ తరలించినట్లు తెలిపారు.

### హత్య కేసులో నిందితుడు..

సంగారెడ్డి క్రైమ్: జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన లారీ డ్రైవర్ దారుణ హత్య నిందితుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సంగారెడ్డి రూరల్ ఎస్సై సుదర్శన్ కథనం ప్రకారం.. నిజాంపేట మండలం నాగధార్ రామచందర్ తండాకు చెందిన ఆంగోత్ దశరథ్ (26), సంగారెడ్డిలోని గణేష్ ఫ్యాక్టరీలో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈనెల 12న ఇంటికి వెళ్తున్నానని చెప్పి తన యజమాని మల్లేశం బైక్ తీసుకొని గ్రామానికి వెళ్లాడు. స్థానికంగా లేకపోవడం, ఇంటికి రాకపోవడంతో అతని భార్య సోనిభాయ్ 14న సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. 15న శనివారం సాయంత్రం నిజాంపేట మండలంలోని మేఘ్యానాయక్ తండాకు చెందిన గోపాల్ నారాయణఖేడ్ స్టేషన్‌లో దశరథ్‌ను హత్య చేసినట్లు లొంగిపోయాడు. నిందితుడిని సంగారెడ్డి రూరల్ స్టేషన్‌కు తరలించారు.

## శుభకార్యానికి వచ్చి.. కారు ప్రమాదంలో బాలుడు మృతి

- మరో ముగ్గురు పిల్లలకు తీవ్ర గాయాలు
- అతివేగంగా వచ్చి బోల్తాపడ్డ కారు
- వాహనాన్ని నడిపిన 17 ఏళ్ల బాలుడు
- మిరుదొడ్డి మండలం అల్వాలలో ఘటన



జయ రక్షిత్ (ఫైల్)



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

మిరుదొడ్డి(దుబ్బాక): బంధువుల ఇంట్లో శుభకార్యానికి వచ్చి సరదాగా వాగు పరిసరాలను, వ్యవసాయ పొలాలను తిలకిద్దామని వెళ్లిన బాలుడు కారు బోల్తా పడటంతో మృతి చెందాడు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ నలుగురిలోని 17 ఏళ్ల మైనర్ బాలుడు అతివేగంగా కారు నడపడంతోనే ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలిసింది. ఈ విషాదకర ఘటన సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అల్వాలలో సోమవారం చోటు చేసుకుంది. మిరుదొడ్డి పోలీసుల కథనం మేరకు.. హైదరాబాద్‌లోని మల్లాపూర్‌కు చెందిన లేగల నరేందర్, సుజాత దంపతులు వారి పిల్లలు జయ రక్షిత్ (14), జశ్వంత్‌తో కలిసి అల్వాలలోని తమ బంధువులైన బొమ్మ జ్యోతి గృహ ప్రవేశం కార్యక్రమానికి వచ్చారు. అలాగే కరీంనగర్ పట్టణానికి చెందిన ఏదుల రవిశంకర్, స్వప్న దంపతులు వారి పిల్లలు యశ్వంత్, అమ్ములుతో హాజరయ్యారు. సోమవారం సరదాగా అల్వాల శివారులోని కోదండరాముడి ఆలయం, కూడవెల్లి వాగు పరిసరాలు, వ్యవసాయ పొలాలను తిలకించడానికి జయ రక్షిత్, జశ్వంత్, యశ్వంత్, అమ్ములు కలిసి కారులో బయలు దేరారు. ఇందులోని 17 ఏళ్ల మైనర్ బాలుడు జశ్వంత్ కారు నడుపుతున్నాడు. ఎరుకలి వాడ సమీపంలోకి రాగానే మలుపు వద్ద కారు అతివేగంగా వస్తూ అదుపు తప్పి బోల్తా పడింది. రెండు పల్టీలు కొట్టడంతో కారులోని జయ రక్షిత్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ముగ్గురు పిల్లలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని స్థానికుల సహాయంతో 108 ద్వారా సిద్దిపేట జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. జశ్వంత్, యశ్వంత్‌ల పరిస్థితి విషమంగా మారడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుడు మల్లం రవి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## తునికి ఆలయం వేలం పాట వాయిదా

- పాత బకాయిలు వసూలు చేయాలని గ్రామస్తుల డిమాండ్
- నోటీసులు ఇస్తామన్న ఈఓ



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): పాత బకాయిలు వసూలు చేసే వరకు వేలం పాటను ఆపాలని తునికి గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో వేలం పాట వాయిదా పడింది. ఈ ఘటన మండలంలోని తునికి నల్ల పోచమ్మదేవి ఆలయం వద్ద సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తునికి నల్ల పోచమ్మ దేవి ఆలయం జాతర వచ్చే నెలలో జరుగనుంది. అధికారులు కొబ్బరికాయలు, దుకాణాలు, టెంట్ సామగ్రి అద్దెతోపాటు వాహనాల పార్కింగ్‌కు వేలంపాటను ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావు, పరిశీలకులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. దీంతో మాజీ కో ఆప్షన్ సభ్యుడు రహీం, మాజీ ఆలయ కమిటీ చైర్మన్లు చెల్ల మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సాయిలు, మాజీ ఉపసర్పంచ్‌లు మాణిక్య రెడ్డి, శేఖర్, గ్రామస్తులు వేలం పాటను అడ్డుకున్నారు. గతేడాది వేలం పాట ద్వారా ఆలయానికి రూ.44 లక్షలు ఆదాయం రాగా, ఇందులో రూ.4.90 లక్షలు బకాయి ఉన్నట్లు తెలిపారు. అలాగే నాలుగేళ్లకు సంబంధించి రూ.30 లక్షల వరకు పలువురు బకాయి పడినట్లు అధికారులు తెలిపారు. బకాయిలు చెల్లించని వారికి నోటీసులు జారీ చేసి కేసులు వేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. స్పందించిన ఇన్‌చార్జి ఈఓ రంగారావు బకాయిదారులకు నోటీసులు ఇస్తామని, స్పందించకపోతే పోలీస్‌లకు ఫిర్యాదు చేస్తామని వేలం పాటను వాయిదా వేశారు. 24న తిరిగి వేలం పాటను నిర్వహిస్తామని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

- బైక్, ఇంట్లోని సామగ్రి, సర్టిఫికెట్లు కాలి బూడిద
- రూ.20 లక్షల ఆస్తినష్టం



ప్రమాదంలో కాలిపోయిన ఇల్లు

మెదక్ మున్సిపాలిటీ: విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైన ఘటన మెదక్ పట్టణంలోని కుమ్మరిగల్లిలో సోమవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకులు, స్థానికుల కథనం మేరకు .. మెదక్ పట్టణం కుమ్మరి గడ్డకి చెందిన కుమ్మరి సంతోష్ ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది. సంతోష్ మెడికల్ ల్యాబ్ ఏర్పాటు కోసం సమకూర్చుకున్న రూ.4 లక్షల నగదు, 15 తులాల బంగారు ఆభరణాలు, ప్యాషన్ ప్రో బైక్, ఫ్రిడ్జ్, టీవీ, తదితర సామగ్రి కాలి బూడిదయ్యాయి. సంతోష్, అతడి భార్యకు సంబంధించి విద్యార్హత సర్టిఫికెట్లు అన్నీ కాలిపోయాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది వచ్చి మంటలార్పారు. అయితే అప్పటికే ఇంట్లోని సామగ్రి పూర్తిగా కాలిపోయింది. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఘటనా స్థలాన్ని సందర్శించి పంచనామా నిర్వహించారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు సంతోష్ విజ్ఞప్తి చేశాడు.

## 541 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



లారీని పట్టుకున్న ఎస్ఐ

జహీరాబాద్: అక్రమంగా పక్క రాష్ట్రాలకు రెండు లారీల్లో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. మొగుడంపల్లి మండలంలోని మాడ్గి గ్రామ శివారులోని రాష్ట్ర సరిహద్దులో గల రవాణా చెక్ పోస్టు వద్ద సోమవారం సివిల్ సప్లయ్ శాఖ అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. రెండు లారీల్లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గుర్తించారు. హైదరాబాద్ నుంచి కర్ణాటకకు లారీలో 266 క్వింటాళ్లు, హైదరాబాద్ నుంచి మహారాష్ట్రకు లారీలో 275 క్వింటాళ్ల బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నాం. ఈ సందర్భంగా ఆయా లారీల యజమానులు మన్సూర్, జాకీర్, లారీ డ్రైవర్లు ఎం.డీ పాషా, భీమయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## సీసీఐలో వెయ్యి క్వింటాళ్ల దళారుల పత్తి

- రూ.15 లక్షలు వ్యాపారులకు లాభం
- కమీషన్ల పేరుతో రూ.5 లక్షలు పంపకం
- 18 మంది బోగస్ రైతులను గుర్తించిన అధికారులు



మీర్జాపూర్‌లో రైతులను విచారిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి రాధిక

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్‌లోని నాలుగు కాటన్ మిల్లుల్లో నాలుగు సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయగా అధికారులు వెయ్యి క్వింటాళ్ల దళారుల పత్తిని గుర్తించారు. ఇక్కడ బోగస్ రైతుల పేరున దళారులు నాసిరకం పత్తి విక్రయిస్తున్నారని సాక్షిలో పక్షం రోజుల కింద 'సీసీఐలో సిత్రాలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు మరుసటి రోజే కాటన్ మిల్లులను తనిఖీ చేయడంతో దళారుల దందా మూడు రోజులు ఆగి మరుసటి రోజు నుంచి కొనసాగింది. సోమవారం జిల్లా వ్యవసాయ అధికారి రాధ, మార్కెటింగ్ అధికారి నాగరాజు, ఏడీఏ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వారు ఇప్పటికే గుర్తించిన మీర్జాపూర్ గ్రామంలోని 12 మంది బోగస్ రైతులను కలిశారు. మాందాపూర్‌లో నలుగురు, హుస్నాబాద్ క్లస్టర్ పరిధిలో ఇద్దరు మొత్తం 18 మంది బోగస్ రైతులు ఉన్నట్లు తేల్చారు. 18 మంది పేరున వ్యాపారులు 1,000 క్వింటాళ్ల విక్రయించి దళారులు రూ.15 లక్షల లాభాలను పొందారు. ఈ దందాకు సహకరించిన అధికారులకు, కంప్యూటర్ ఆపరేటర్లకు, రాజకీయ నాయకులకు దళారులు రూ.5 లక్షల వరకు కమీషన్ల కింద పంపిణీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

### పంట వేయని రైతుల పేరున ధ్రువీకరణలు

హుస్నాబాద్ కాటన్ మిల్లు వ్యాపారులు మెదక్, సంగారెడ్డి, కరీంనగర్, జనగామ జిల్లాల నుంచి నాసిరకం పత్తిని క్వింటాల్‌కు రూ.6 వేల చొప్పున కొనుగోలు హుస్నాబాద్ సీసీఐ కేంద్రాలకు తరలించారు. బోగస్ రైతుల పేరున ధ్రువీకరణ పత్రాలు తయారు చేసే వరకు పత్తి వాహనాలను మిల్లులో పక్కన పార్కింగ్ చేసి పెట్టారు. హుస్నాబాద్, మహ్మదాపూర్, మీర్జాపూర్ వ్యవసాయ క్లస్టర్ పరిధిలోని ఏఈఓలకు తెలువకుండానే 18 మంది రైతులకు బోగస్ ధ్రువీకరణ పత్రాలను సృష్టించారు. మా సంతకాలను ఫోర్జరీ చేసినట్లు ఏఈఓలు ఏడీఏకు ఫిర్యాదు చేశారు. దీనిపై మార్కెట్ కార్యాలయంలో విచారణ జరిపిన అధికారులకు ఏఈఓల సంతకాలు ఫోర్జరీ చేసి బోగస్ రైతుల పేరున ధ్రువీకరణ పత్రాలు ఇచ్చినట్లు గుర్తించారు. మండల వ్యవసాయ అధికారి నాగరాజు దగ్గర ఉండాల్సిన రసీదు బుక్ నుంచే ధ్రువీకరణ పత్రాలు వెళ్లినట్లు డీఏఓ రాధిక వెల్లడించారు. మార్కెటింగ్ అధికారులతో కలిసి విచారణ చేసి కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.